సూర్య
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
బుధవారం,4 సెప్టెంబర్ 2024


# నా పేరుతో అవినీతికి పాల్పడితే చర్యలు



**- ఎమ్మెల్యే చిర్రి బాలరాజు హెచ్చరిక**

**బుట్టాయిగూడెం,మేజర్ న్యూస్:** ఉద్యోగుల బదిలీల్లో నా పేరు చెప్పుకొని ఎవరైనా అవినీతికి పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు హెచ్చరించారు. 'వామ్మో ఆ కాగితం ఖరీదు 30వేలు'! అని సూర్య దినపత్రికలో ఈనెల 2వ తేదీ సోమవారం వచ్చిన వార్తకు ఆయన తీవ్రంగా స్పందించారు. ఎమ్మెల్యే చరవాణిలో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులుగాని, ప్రజలుగాని ఏదైనా సమస్య ఉంటే నేరుగా తన వద్దకు వచ్చి పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని నా పేరును వాడుకొని ఎవరైనా అవినీతికి పాల్పడితే ఎంతటి వారయినా ఉపేక్షించేది లేదని అన్నారు. ప్రజలు తనను నమ్మి గెలిపించారని, అటువంటి ప్రజలకు సేవ చేసుకొనే అదృష్టం దక్కినందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఉద్యోగులకు తాము ఎప్పుడూ అండగా ఉంటామని,ఏ సమస్య వచ్చినా నేరుగా తన వద్దకు రావాలని, మధ్యవర్తులను ఆశ్రయించవద్దని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కోరారు.

# భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి ఉధృతి

**-కుక్కునూరు,వేలేరుపాడు**
**మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**
**- టోల్ ఫ్రీ నెం. 18002331077**



**ఏలూరు,మేజర్ న్యూస్:** గోదావరి వరద ఉధృతి మరలా పెరుగుతున్న దృష్ట్యా గోదావరి నదీతీర ప్రాంతంలోవున్న కుక్కునూరు,వేలేరుపాడు మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి విజ్ఞప్తి చేశారు. ఎమైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు భద్రాచలం వద్ద 38.50అడుగులకుగోదావరినీటిమట్టం నమోదైయిం దని ఇది మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ముంపుకు గురయ్యే ప్రాంతాల ప్రజలను తరలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పెరుగుతున్న గోదావరి వరద నేపద్యంలో అధికారు లంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. వరద పరిస్థితులను ఎదుర్కొనేందుకు నిర్ధేశించిన మార్గదర్శకాలను పాటించి అందుకు తగిన విధంగా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. మొదటి ప్రమాధ హెచ్చరిక జారీ చేయకముందే ముంపు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని ముఖ్యంగా ఆయా గ్రామాల్లోని గర్భిణులు, అనారోగ్యంగా ఉన్నవారిని, వృద్ధులను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. పునరావాస కేంద్రాల వద్ద అవసరమైన నిత్యావసర వస్తువులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈవిషయంపై పౌర సరఫరాల డిఎం,డిఎస్ఓ,మార్కెటింగ్ ఎడిలు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన మేర కొవ్వొత్తులు,అగ్గిపెట్టెలు, మస్కిటో కాయిల్స్, విద్యుత్ సౌకర్యంకు తగు ఏర్పాట్లు చేయాలన్నారు. గోదావరి ఉధృతి దుష్ట్యా ఆయా మండలాల ప్రజలు గోదావరినది పరివాహక ప్రాంతాల్లోకి వెళ్లవద్దన్నారు. త్రాగునీటికి ఇబ్బంది లేకుండా వాటర్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని పునరావాస కేంద్రం వద్దకూడా అవసరమైన త్రాగునీటి వసతి, టాయిలెట్లను సిద్దం చేయాలన్నారు. పారిశుధ్య పరిస్థితులను మెరుగుపరచడంతోపాటు వైద్య శిబిరాలను ఏర్పాటుకు సిద్ధంగా ఉండాలన్నారు. వరద పరిస్థితిపై కలెక్టర్ వెట్రిసెల్వి ఎప్పటికప్పుడు అధికారులతో టెలిఫోన్ ద్వారా సమీక్షించి అవసరమైన సూచనలను అందజేస్తున్నారు.

# గోతులు కూడా పూడ్చలేని మీరా నన్ను విమర్శించేది ?

**- మాజీ డిప్యూటీ సీఎం కొట్టుపై ఎమ్మెల్యే బొలిశెట్టి ధ్వజం**



**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్:** ఆధారాలు లేని ఆరోపణలు చేస్తే ప్రజల చేతుల్లో చెప్పు దెబ్బలు తింటారు అని మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణకు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ వార్నింగ్ ఇచ్చారు.నిన్నటి రోజునతనపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు ఆయన తీవ్రంగా స్పందించారు. ఐదేళ్ల పాలనలో రోడ్లపై గోతులు కూడా పూడ్చలేని మీరు నన్ను విమర్శించడం హాస్యాస్పదమన్నారు. ప్రవాస ఆంధ్రులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అతిధిగా సింగపూర్ వెళ్లానని పేకాట ఆడుతున్నానంటూ మీరు విమర్శించడం మీ దగ్గర ఆధారాలు ఉంటే నిరూపించాలన్నారు. నీ కొడుకు విశాల్ రాచర్ల రైస్ మిల్లులో, మీన వల్లూరు లో క్లబ్బులు నిర్వహించిన సంగతి నీకు తెలియదా అంటూ ఎద్దేవా చేశారు. అనాథరైజ్డ్ లేఅవుట్లలో కోట్లు మింగింది నువ్వు కాదా ఒక్కొక్క రోజు నువ్వు తీసుకున్న లంచాలు నిరూపించడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. నేను కష్టపడిసంపాదించి తాడేపల్లిగూడెం అభివృద్ధికి ఖర్చుపెట్టానే తప్ప నీలా కమిషన్లకు కక్కుర్తి పడలేదన్నారు. నీతో కమిషన్లు తీసుకుంటున్నాను అని చెప్పిన వారిని మీడియా ముందుకు రావాలంటే సవాల్ విసిరారు. సన్నాసి మాటలు ఆపకపోతే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయన్నారు.

**- వరద బాధితులకు దాతలు సహకరించండి -** కృష్ణాజిల్లా వరద ప్రభావంతో అతలాకుతలమైన నేపథ్యంలో వారికి కనీస సౌకర్యాలు కల్పించేందుకు తాడేపల్లిగూడెంలోని దాతలు అందరూ ముందుకు రావాలని తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కష్టాల్లో ఉన్న ప్రజలకు సహాయం చేయడంలో తాడేపల్లిగూడెం దాతలు ఎప్పుడూ ముందుంటారని ఆయన అన్నారు. ఇప్పటికే దాదాపు 40 వేల ప్యాకెట్ల వరకు ఆహారాన్ని విజయవాడకు పంపించామని వరద ప్రభావం తగ్గే వరకు ఎన్ని రోజులైనా తాడేపల్లిగూడెం నుంచి ప్రతిరోజు 20వేల ప్యాకెట్లకు తగ్గకుండా ఆహారాన్ని అందించడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. మీడియా సమావేశంలో యువ నాయకులు బొలిశెట్టి రాజేష్, పట్టణ అధ్యక్షుడు వర్తనపల్లి కాశి, పెంటపాడు అధ్యక్షుడు పుల్లా బాబి, సీనియర్ కౌన్సిలర్ పాలూరు వెంకటేశ్వరరావు, తోట రాజ, నీలపాల దినేష్, తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడ వరద బాధితులకు పెద్ద ఎత్తున సహాయం

**- దాతలకు జిల్లా కలెక్టర్ కృతజ్ఞతలు**



**భీమవరం,మేజర్ న్యూస్:** విజయవాడ ప్రాంతవాసులు అకాల వరదలలో చిక్కుకోవడంతో ప్రభుత్వసూచనలమేరకు పశ్చిమ గోదావరి జిల్లా నుండి పెద్ద ఎత్తున వరద సహాయాన్ని అందజేసినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.గత రెండు రోజులుగా కొనసాగుతున్న వరద సహాయ చర్యల్లో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా నుండి 1,98,960 ఆహార పొట్లాలు, 70 వేల వాటర్ ప్యాకెట్లు, ఐదు వేల ఆఫ్ లీటర్ వాటర్ బాటిల్స్, 1,15,100 బిస్కెట్ ప్యాకెట్స్, 14 వేల బన్స్, 22 వేల రస్కుల ప్యాకెట్స్ వివిధ స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారవేత్తలు, అసోసియేషన్స్, విద్యాసంస్థలు, ఇండస్ట్రీస్, ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలు, తదితరులు సహకారంతో విజయవాడకు ప్రత్యేక వాహనాల ద్వారా పంపడం జరిగిందని తెలిపారు.

పకృతి వైపరీత్యాల సమయంలో ఆపన్న హస్తం అందించడానికి ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.వరదసాయానికి ఆహార పదార్థాలు అందజేయడంలో గత రెండు రోజులుగా నిరంతరం పనిచేసిన అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## విపత్కర పరిస్థితుల్లో ఉద్యోగుల స్పందన అభినందనీయం



**- జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి**

**ఏలూరు,మేజర్ న్యూస్:** విపత్కర పరిస్థితుల్లో వరద బాధితులను ఆదుకోవడంలో ఉద్యోగుల స్పందన అభినందనీయమని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పేర్కొన్నారు. విజయవాడ వరద బాధితులను ఆదుకునే క్రమంలో ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ సేకరించిన 1,00,116 రూపాయల చెక్కును మంగళవారం స్థానిక కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి వారికి అసోసియేషన్ నాయకులు అందజేశారు. ఈసందర్భంగా జిల్లాకలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ఈ విషయంలో ఉద్యోగుల స్పందన స్ఫూర్తిదాయకమని,ఇదే స్ఫూర్తితో ప్రజలకు మెరుగైనసేవలుఅందించడంలో ముందుండాలని ఆకాంక్షించారు.

రాష్ట్ర ఇరిగేషన్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఒక ప్రక్క జిల్లాలో భారీవర్షాల నేపధ్యంలో జిల్లా కలెక్టర్ చాక చక్యంగా బాధితులను ఆదుకోవడం, పునరావాస కార్యక్రమాలు నిర్వహిస్తూ మరోప్రక్క విజయవాడ నగరంలో వరద బాధితులకు ఆహార పొట్లాలను, వాటర్ ప్యాకెట్లు, బ్రెడ్, బిస్కెట్లు, అగ్గిపెట్టెలు, కొవ్వొత్తులు,తదితరాలను గత రెండు రోజులుగా జిల్లానుంచి పంపడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి డి. పుష్పమణి, ఎపి ఎన్ జివోస్ అసోషియేషన్ కార్యదర్శి నెరుసు రామారావు, జె ఏ సి రాష్ట్ర నాయకులు ఆర్ ఎస్ హరనాథ్, ఏలూరు తాలూకా ఎన్జీవోస్ అసోసియేషన్ నాయకులు కప్పల సత్యనారాయణ, ఎండి బేగ్, పూడి శ్రీనివాస్, కె.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## నేడు మూడు మండలాల్లో పాఠశాలలకు సెలవు

ఏలూరు,మేజర్‌న్యూస్:ఏలూరు జిల్లాలోని కుక్కునూరు,వేలేరుపాడు, పోలవరం మండలాల్లోని అన్ని మేనేజ్మెంట్ స్కూళ్లకు ప్రభుత్వం సెలవు ప్రకటించిందని జిల్లా విద్యాశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఏ స్కూలు లోనైనా ఇబ్బందికర పరిస్తితులు ఏర్పడితే అక్కడ సెలవు ప్రకటించ వచ్చని ఆయన తెలిపారు.

# మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి

**- ఆర్‌డిఓకు 'దేశం' నేతల వినతి**



**నర్సాపురం,మేజర్‌న్యూస్:**నియోజకవర్గంలో విషజ్వరాలు ఎక్కువగా ఉన్నాయని, మెడికల్ క్యాంపులు నిర్వహించి ప్రజల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని ఆర్డీవో అచ్యుత అంబరీష్‌ను తెలుగుదేశం పార్టీ నాయకులు కోరారు.మంగళవారం ఆర్డీవో చాంబర్లో తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు యంఏంషరీఫ్, నియోజకవర్గ ఇన్చార్జి పొత్తూరి రామరాజు, ఆపార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలి యతి రాజ రామ్మోహన్ నాయుడు కలిశారు.కొద్దిసేపునియోజకవర్గంలోని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు,అవసరాలు తదితర వాటిపై చర్చించారు. వెంటనే మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి, కావలసిన పరీక్షలన్నీ చేసి ఉచితంగా మందులఅందించే ఏర్పాట్లుచేయాలనివారు కోరారు. ఈకార్యక్రమంలోపలువురుతెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మంత్రి పార్థసారథి ఆదేశాలతో గంటల వ్యవధిలో రహదారి పునరుద్ధరణ





నూజివీడు,మేజర్ న్యూస్ : రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశాలతో పాడైన రహదారిని గంటల వ్యవధిలోనే అధికారులు పునరుద్ధరించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నూజివీడు నియోజకవర్గములో వాగులు పొంగడంతో పలు రోడ్లు పాడయ్యాయి. భారీ వర్షాల కారణంగా ముంపునకు గురైన ప్రాంతాలలో ఆదివారం సాయంత్రం ప్రజలను పరామర్శించి వారి సమస్యలను తెలుసుకునేందుకు వెళ్లిన మంత్రికి పూర్తిగా పాడైన నూజివీడు నుండి గంపలగూడెం రహదారికి మరమ్మత్తులు చేయించాలని గ్రామస్థులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అధికారులను అదేశించడమే కాక సదరు రోడ్డు మరమ్మత్తు పనులు ఎంతవరకు చేపట్టారని అధికారులను అడిగి ఆరా తీశారు. దాంతో అధికారులు యుద్ధప్రాతిపదికన రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టారు. గంటల వ్యవధిలోనే పూర్తి చేసి, మంగళవారం ఉదయం నాటికి రోడ్డు మరమ్మత్తులు పూర్తిచేసి, ప్రజలకు అందుబాటులోనికి తీసుకువచ్చారు. జిల్లాలో పాడైన రహదారులకు సంబంధించి జిల్లా పరిషత్ రోడ్లు, పంచాయితీ రాజ్ రోడ్లు, ఆర్,అండ్ బి రోడ్లు సి, సి, రోడ్లు, బి,టీ.రోడ్లు వివరాలను సంబంధిత అధికారులనుండి పూర్తి నివేదికను సేకరించి తక్షణ చర్యలు తీసుకోవలసిందిగా మంత్రి పార్థసారథి అధికారులను ఆదేశించారు. తమ సమస్యపై వెంటనే స్పందించి రహదారి మరమ్మత్తు పనులు పూర్తిచేసేందుకు తీసుకున్న చర్యలకు హర్షాన్ని వ్యక్తంచేస్తూ,మంత్రి పార్థసారథికి ప్రజలు కృతజ్ఞతలు తెలియజేసారు.

## నూజివీడు పెద్ద చెరువును పరిశీలించిన బిజెపి బృందం





నూజివీడు,మేజర్‌న్యూస్ : ఇటీవల కురిసిన ఎడతెరిపిలేని వర్షాల వలన నూజివీడు పట్టణంలో దెబ్బతిన్న ప్రాంతాలను ఏలూరు జిల్లా బిజెపి అధ్యక్షులు విక్రమ్ కిషోర్ నాయకత్వంలో బిజెపి జిల్లా, నూజివీడు నియోజకవర్గ ముఖ్యనాయకుల బృందం మంగళవారం సందర్శించి బాధితులను పరామర్శించింది.పట్టణంలోని పెద్దచెరువుకు పడిన గండ్లను స్వయంగా పరిశీలించారు.

దెబ్బతిన్న పంటపొలాలను, ఇండ్లను సందర్శించి బాధితులను పరామర్శించారు.ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు సి.హెచ్.విక్రమ్ కిషోర్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా సంభవించిన వరద విపత్తు కారణంగా చెరువు కట్టలు తెగిపోవటం, కాల్వలు,డ్రెనేజీలు పొంగిపోర్లటంతో నూజివీడు ప్రాంతంలో పంట పొలాలకు నష్టం వాటిల్లిందని,రహదారులు దెబ్బతిన్నాయని అన్నారు. పలు కాలనీల్లో విపత్తు వలన గృహాలు సైతం దెబ్బతిన్నాయని చెప్పారు. ప్రభుత్వం తీసుకున్న తక్షణ చర్యల వలన ప్రాణ నష్టం జరుగలేదన్నారు. పునరావాస, సహాయక చర్యలు తీసుకోవటంలో ప్రభుత్వ యంత్రాంగం తీసుకున్న చర్యలు పట్ల బిజెపి నాయకులు సంతృప్తి వ్యక్తం చేశారు.

**- ట్రిపుల్ ఐటీని సందర్శించిన బిజెపి బృందం -** ఇటీవల ట్రిపుల్ ఐటీలో ఫుడ్ పాయిజన్ వలన పెద్ద సంఖ్యలో విద్యార్థులు అస్వస్థకు గురైన సంఘటనపై జిల్లా అధ్యక్షులు విక్రమ్ కిషోర్ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు ట్రిపుల్ ఐటీ డైరక్టర్ చంద్ర శేఖర్‌ని కలిసి చర్చించారు. అదే విధంగా విద్యార్థులను కలిసి సంఘటన పూర్వపరాలపై అడిగి తెలుసుకున్నారు.ప్రస్తుత పరిస్థితులై వాకబు చేశారు. విద్యా సంస్థలో విద్యార్థులకు ఎటువంటి సమస్యలు వచ్చినా , ఇబ్బందులు ఎదురైనా బిజెపి దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి అండగా ఉంటామని విక్రమ్ కిషోర్ విద్యార్థులకు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమాలలో బిజెపి జిల్లా కన్వీనర్ కట్నేని కృష్ణ ప్రసాద్, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు చక్రధర్ రావు,మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు శివరాజు వసుంధరదేవి ,నూజివీడు నియోజకవర్గ బిజెపి కన్వీనర్ జి. ఆర్. కె. రంగారావు,పట్టణ బిజెపి అధ్యక్షులు బోను అప్పారావు,జిల్లా ఉపాధ్యక్షులు మల్లిపూడి రాజశేఖర్,జిల్లా కోశాధికారి మాటూరి రవికాంత్ ,జిల్లా కార్యదర్శి మాగంటి వాసు,జిల్లా కార్యవర్గ సభ్యులు దోసపాటి జనార్దనరావు ,పట్టణ ప్రధాన కార్యదర్శులు రెడ్డి మురళీమోహనరావు ,అంబటి మల్లేశ్వరరావు,బట్టా సత్యనారాయణ, పట్టణ ఎస్సీ మోర్చా అధ్యక్షులు చింతల సంజయ్, పట్టణ నాయకులు అచ్యుతరామయ్య,సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి దృష్టికి రైతుల సమస్యలు : ఎంఏ షరీఫ్



**నర్సాపురం రూరల్,మేజర్ న్యూస్ :** మండలం'లోని రుస్తుంబాద పంచాయితీలో, పలు ప్రాంతాలలో అకాల వర్షాల వల్ల దెబ్బతిన్నా వరిచేనులనితెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు ఎంఏ షరీఫ్ స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో రైతులకు జరిగిన నష్టాన్నిముఖ్య మంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని రైతులకు హామీ ఇచ్చారు. పంట నష్టాన్ని అంచనా వేయవలసిందిగా వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి పొత్తూరి రామరాజు,రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలి యతిరాజా రామ్మోహన్ నాయుడు,దేశం మండల అధ్యక్షులు వాతాడి ఉమా మహేశ్వరరావు, మండల కార్యదర్శి అందే రామకృష్ణ, పట్టణ అధ్యక్షులు జక్కం శ్రీమన్నారాయణ,శంకు భాస్కర్ నాయుడు, ముక్కు బాబురావు,ఆకాన సుబ్రమణ్యం,నక్కా ఆనంద్, దొంగ పద్మారావు,మల్లాడి మూర్తి,చెల్లబోయిన వాసు, శంకరపు వెంకటేశ్వర్లు,దొంగ శ్రీరామచంద్రుడు, జక్కం కాసి, కోరాడ పాపారావు,ఆర్.కె నంద తెలుగుదేశం,జనసేన, బీజేపీ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంచాయతీ నిధుల దుర్వినియోగంపై కార్యదర్శి సస్పెన్షన్

**ద్వారకాతిరుమల,మేజర్‌న్యూస్:** ద్వారకాతిరుమల పంచాయతీ కార్యదర్శి ఎల్.వెంకటేశ్వరావుని గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం కేసులో కమీషనర్ పంచాయతీ రాజ్ అండ్ గ్రామీణ అభివృద్ధి కృష్ణ తేజ వారు విధుల నుండి సస్పెండ్ చేయడం జరిగింది.

## వరద బాధితుల సహాయార్థం దాతలు ముందుకు రావాలి : ఎమ్మెల్యే బొలిశెట్టి



**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్:** కృష్ణా జిల్లాలోని పలు ప్రాంతాల్లో వరద ముంపులో ఉన్న బాధితులను ఆదుకోవడానికి తాడేపల్లిగూడెంలోని దాతలు ముందుకు రావాలని శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తయారుచేసి పంపిణీకి సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాలను ఆయన పరిశీలించి విజయవాడకు పంపించారు. ఇంతటి మంచి కార్యక్రమాన్ని నిర్వహించిన రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులను ఆయన అభినందించారు.

వరద ముంపులో ఉన్న వారిని ఆదుకునేందుకు తాను సైతం సిద్ధంగా ఉన్నానని తన వంతు సహకారాన్ని కూడా వరద బాధితులకు అందిస్తున్నట్లుగా తెలిపారు. స్థానిక భారతీయ విద్యా భవన్ ప్రాంగణం నుంచి సుమారు పది వాహనాల్లో ఆహార పోట్లాలను వరద ప్రభావిత ప్రాంతాలకు పంపించారు. ముందు ముంపు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను మనం కాపాడుకోవాలని ఎవరు ఆకలితో అలమటించకూడదనే ఉద్దేశంతో తొలుత ఆహార పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

## ముంపు గ్రామాల్లో టీడిపి నాయకుల పర్యటన



**మండవల్లి,మేజర్ న్యూస్:** ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం మండవల్లి మండలం మణుగులూరులో పెద్ద యడ్లగాడి దగ్గర బుడమేరు నీరు కొల్లేరు సరస్సులోకి చేరి నీటి ప్రవాహం ఉధృతంగా ఉంది . గురబడెక్క తొలగిస్తున్న, నీరు రోడ్లు పైకి వచ్చి చేరింది. పెనుమాకలంక గ్రామానికి వెళ్ళే రహదారి నీటి ప్రవాహంతో పూర్తిగా మునిగిపోయింది. అలాగే ఏలూరు – కైకలూరు రహదారి పైకి నీరు వచ్చి చేరింది. కైకలూరు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కామినేని శ్రీనివాస్ సూచనలు మేరకు ముంపు ప్రదేశాన్ని టీడీపీ నేతలు పరిశీలించారు. రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వహక కార్యదర్శి పూల రామచంద్రరావు(రాజీ),జిల్లా టిడిపి వాణిజ్య విభాగం అధ్యక్షులు కె.కె.బాబు, నియోజకవర్గ టిడిపి కో– కన్వీనర్ కొడాలి వినోద్,తెలుగుదేశం పార్టీ నాయకులు వీరాబత్తిన సుధ,నియోజకవర్గ తెలుగుయువత ఉపాధ్యక్షులు అబ్దుల్ బాబా,గ్రామ టిడిపి నాయకులు గూండాబత్తిన నాని,దావులూరి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యాధులు ప్రబలకుండా అందుబాటులో హోమియో మందులు



**ముదినేపల్లి,మేజర్ న్యూస్ :** కాలానుగుణంగా సంభవించే వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు హోమియో మందులు అందుబాటులో ఉన్నట్లు ఆయుష్ వైద్యురాలు హేమలత తెలిపారు.

ముదినేపల్లి పీహెచ్సీలో హోమియో (ఆయుష్) విభాగంలో చికెన్ గున్యా, మలేరియా , టైఫాయిడ్ , డెంగ్యూ తదితర వ్యాధులు సోకకుండా ఉండేందుకు ముందస్తు నివారణకుగా హోమియో మందులు ఎంతో ప్రయో జనకరంగా ఉంటాయని మండలం ప్రజలు సమీపంలోని పీహెచ్సీలో మందులు పొందవచ్చని తెలిపారు. వ్యాధి సోకిన తర్వాత బాధపడే కంటే ముందస్తుగానే మందులు తీసుకోవాలని కోరారు.

# గ్రామాల్లో పారిశుద్ధ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

### – జిల్లా పంచాయతీ అధికారి టి శ్రీనివాస్ విశ్వనాథ్




**ముదినేపల్లి,మేజర్ న్యూస్ :** గ్రామాల్లో పారిశుద్ధ్య పరిరక్షణ,తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి విశ్వనాథ్ అన్నారు. ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మండలంలో గ్రామ కార్యదర్శిలతో పారిశుద్ధ్యం , తాగునీరు సరఫరా పలు అంశాలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా గ్రామాల్లో కచ్చాడ్రైన్లు పొంగడం వర్షం నీరు నిలవ ఉండడంతో గ్రామాల్లో పారిశుద్ధ్య పరిరక్షణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు దీనిపై గ్రామాల వారీగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ముదినేపల్లి మండలంలో పారిశుద్ధ్య పరిరక్షణ , తాగునీటి సరఫరా భేషుగా ఉందన్నారు. వర్షాల కారణంగా గ్రామాల్లో, కాలనీలో, లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు చేరడంతో నీటిని బయటకు తరలించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం వాతావరణం ఇదే పరిస్థితులు ఉందని మరిన్ని చర్యలు చేపట్టడానికి సమయం పడుతుందన్నారు.

రెండు గ్రామాల్లో పరిస్థితులు విభీనంగా ఉన్నాయని వాటిని పరిశీలించి మెరుగుపరుచుతామన్నారు.

– కుక్కలు కోతులు బెడద –మండలంలో కోతులు , కుక్కలు బెడద తమ దృష్టికి వచ్చిందని ప్రజలు ఇబ్బందులను దృష్టించి చర్యలు చేపట్టేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చట్టబద్ధంగానే వాటిని గ్రామాల నుండి బయటకు తరలించడం జరుగుతుందని డిపిఓ వివరించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో పి మల్లేశ్వరి,ఇఒపిఆర్డి దూలం లక్ష్మీనారాయణ,గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

## కచ్చా డ్రైన్ల మురుగు, వర్షం నీరు తరలించేందుకు చర్యలు



**ముదినేపల్లి,మేజర్ న్యూస్ :** భారీ వర్షాల కారణంగా పలు గ్రామాల్లో కచ్చా డ్రైన్ల ముంపుబారిన పడి వర్షం నీటితో కలిసి అస్తవ్యస్తంగా మారాయి. ముదినేపల్లి మండలం గురజ గ్రామంలో ముదినేపల్లిలో ఈ పరిస్థితులు నెలకొన్నాయి. సర్పంచ్లు మంచాల సరస్వతి, నిమ్మగడ్డ కైకమ్మ బిక్షాలు జెసిపి తో కచ్చా డ్రైన్ల క్రమబద్ధీకరిస్తున్నారు. మురుగు ,వర్షంనీరును తరలించే ప్రక్రియను చేపట్టారు. ముదినేపల్లి కాలనీలో వర్షం నీరు స్తంభించడంతో సమస్య పరిష్కారానికి శ్రీకారం చుట్టారు.

### కో-ఆప్షన్ సభ్యుని పదవీకి మున్నుల జాన్ రాజీనామా



**ఏలూరు,మేజర్ న్యూస్:** మున్సిపల్ కో – ఆప్షన్ సభ్యులు,వైసిపి సీనియర్ నాయకులు మున్నుల జాన్ గుర్నాథ్ వ్యక్తిగత కారణాల దృష్ట్యా రాజీనామా సమర్పించారు. రాజీనామా పత్రాన్ని ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్నాప్రగడ భాను ప్రతాప్‌కి మంగళవారం సమర్పించారు.

## దొండ పందిళ్ళ సబ్సిడీ బకాయిలు రైతులకు చెల్లించాలి



**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్** దొండ రైతులకు దొండ పందిళ్ళ సబ్సిడీ బకాయిలు వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశార మంగళవారం ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో దొండ పందిళ్ల సబ్సిడీ బకాయిల కోసం దొండ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. రైతు సంఘం నాయకులు దొండ పందిళ్ళను పరిశీలించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా దొండ పందిళ్ళ సబ్సిడీ బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోవడం వలన దొండ రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టాల్లో కష్టాల్లో ఉన్న దొండ రైతులకు ఎప్పటికైనా ప్రభుత్వ వెంటనే సబ్సిడీ బకాయిలు చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, జిల్లా కమిటీ సభ్యులు గుర్రం రాంబాబు, గుర్రం పాపారావు,పాముల శ్రీనివాసరావు, జి.నరసింహారావు పలువురు దొండ రైతులు పాల్గొన్నారు.

### ఎల్ బి చర్ల పిహెచ్‌సి దగ్గర ఆశా వర్కర్ల ధర్నా



**నరసాపురం రూరల్,మేజర్ న్యూస్ :** 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు మంత్రివర్గంతో ఆశా వర్కర్లకు కుదిరిన ఒప్పందాన్ని అమలు చేయాలని, కోరుతూ మండలంలోని ఎల్ బి చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దగ్గర ఆశా వర్కర్లు ధర్నా చేశారు. మంగళవారం జరిగినకార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తలగంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఒప్పందాలను అమలు చేయలేదని, వెంటనే వేతన ఒప్పందాలను అమలు చేయాలన్నారు. 60 సంవత్సరాల నుండి ఆశ వర్కర్లను జీవో విడుదల అయ్యేవరకు కొనసాగించాలనిఅన్నారు. అనంతరం వినతి పత్రం అందించారు. మండలంలోని పలు గ్రామాల నుండి వచ్చిన ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

### తాగునీరు,పారిశుద్ధ్యాన్ని పరిశీలించిన చైర్ పర్సన్



**నరసాపురం,మేజర్ న్యూస్ :** పురపాలక సంఘ పరిధిలోని 2వ వార్డు నందు గల ప్రధాన రక్షిత మంచి నీటి చెరువును మున్సిపల్ చైర్ పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచినీరు ను పూర్తి నీటి మట్టం వరకు నింపి పురప్రజలకు ఎటువంటి ఆటంకము లేకుండా నీటి సరఫరా చేయాలని ఆలమ్, క్లోరిన్ సిలిండర్ నిల్వలను కొరత లేకుండా చర్యలు తీసుకొనవలసినదిగా ఇంజనీర్ లను ఆదేశించారు. యున్నారు. అనంతరం 23వ వార్డు నందు గల రామాలయం వీధి నందు శానిటేషన్ పరిశీలించి పిచ్చి మొక్కలు, దోమలు బెడద లేకుండా చర్యలు తీసుకొనవలసినదిగా శానిటరీ అధికారులను ఆదేశించారు. 4వ వార్డు నందు వరద ముంపునకు గురైన పొన్నపల్లి ప్రాంతము నందు పర్యటించి ఆక్రమణలు ఎక్కువ ఉండుట వలన తరచూ ఈ ప్రాంతము వరద ముంపునకు గురియగుచున్నదని కావున జేసీ బి చైన్ మెషిన్ తో ఆక్రమణలు తొలగించు పనిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబెర్స్ సోమరాజు దుర్గాభవాని, మల్లాడి బుజ్జి, కావలి నాని గోరు సత్తబాబు వంగా శ్రీకాంత్ కన్నా మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### సిపిఎం రాష్ట్ర కమిటీ కరపత్రాలు పంపిణీ



**నరసాపురం,మేజర్ న్యూస్ :** సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాలు ఈనెల 22, 23, 24 తేదీల్లో పట్టణంలో జరుగుతున్నాయని ఈ సమావేశాలను విజయవంతం చేయాలని కోరుతూ ఆటో కార్మికుల వద్ద కరపత్రాలు పంచుతూ ఆ పార్టీ బృందం విరాళాల సేకరణ చేస్తుంది. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమం సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కవురు పెద్దిరాజు,పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ చారిత్రకమైన నరసాపురం పట్టణంలో సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాలు మొదటిసారిగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశాలకు రాష్ట్ర కమిటీ సభ్యులు,రాష్ట్ర నాయకత్వం ఆల్ ఇండియా నాయకులు మూడు రోజులు పాటు జరిగే రాష్ట్ర కమిటీ సమావేశాల్లో పాల్గొంటున్నారన్నారు. నిత్యం ప్రజల బాగోగులు కోసం రాష్ట్ర అభివృద్ధి కోసం సిపిఎం పార్టీ నిజాయితీగా నిస్వార్థంగా ప్రజల పక్షాన పోరాటకుందన్నారు. సమావేశాలు చివరి రోజు 24వ తేదీన బహిరంగ సభ ఉంటుందన్నారు. ఈసమావేశాలను విజయవంతం చేయడానికి ప్రజానికం వ్యాపారులు వివిధ సంస్థల అధిపతులు మేధావులు అన్ని వర్గాల ప్రజానీకం సహకరించాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ పట్టణ కమిటీ సభ్యులుపొగాకునారాయణరావు,కోడిలక్ష్మణ్‌తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబరులో ఆక్వా కళాశాల 2వ బ్యాచ్ తరగతులు ప్రారంభం



నరసాపురం రూరల్,మేజర్ న్యూస్: ఆక్వా యూనివర్సిటీకి అనుబంధ ఆక్వా కళాశాలగా గత విద్యా సంవత్స రం ప్రారంభమై సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని అసోసియేట్ డీన్ టి.నీరజ అన్నారు. ఈ మేరకు మంగళవారం కళాశాలలోని ఆమె చాంబర్లో విలేకరులతో మాట్లాడారు. రెండో బ్యాచ్ ( బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్) కు సంబంధించి మొదటి విడత కౌన్సిలింగ్ పూర్తయిందని సీట్లు పొందిన విద్యార్థులకు అక్టోబర్లో తరగతుల ప్రారంభమవు తాయని ఆమె అన్నారు. ప్రస్తుతం మండలంలోని లక్ష్మణే శ్వరం గ్రామంలోని తుఫాను షెల్టర్ భవనంలో క్లాసులు నిర్వహిస్తున్నామన్నారు. పూర్తిస్థాయిలో వసతులు, మౌలిక సదుపా యాలు లేకపోవడంతో విద్యార్థులు పలు ఇబ్బందులు పడుతున్నాం ̋న్నారు. ఇక్కడి పరిస్థితిని ఆక్వా యూనివర్సిటీ ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందన్నారు. రెండవ బ్యాచ్ తరగతులు ప్రారంభమైతే వసతుల లేమి, తీసుకోవాల్సిన ప్రత్యామ్నాయాలను యూనివర్సిటీ అధికారులకు నివేదించడం జరిగిందన్నారు. తమ కళాశాలలో 66 సీట్లు ఉన్నాయన్నారు. ఈ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ ఆక్వా కళాశాలను వేరొక ప్రాంతానికి తరలిస్తున్నారు అంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని నీరజ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ ఎన్ వీరభద్ర రావుపాల్గొన్నారు.

# జ్వరాలపై సర్వే సక్రమంగా నిర్వర్తించాలి

### – డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ డి.మహేశ్వర రావు




**పాలకొల్లు,మేజర్ న్యూస్:** లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు ఆకస్మికంగా సందర్శించారు. సచివాలయం పరిధిలో. పి హెచ్ సిలో జ్వరాలు ఎన్నినమోదు అవుచున్నవి అడిగి తెలుసుకున్నారు. అనంతరం.పి హెచ్ సిలో జరుగుతున్న ఆశడే మీటింగ్‌లో పాల్గొని ఆశా కార్యకర్తలను జ్వరాలపై సర్వే గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో సందర్శించినప్పుడు జలక్షణాల గల వారిని గుర్తించి వారికి ప్రాథమిక పరీక్షలు చేసి తక్షణం పీ హెచ్ సికి తరలించి వైద్యం అందేటట్లు చూడాలన్నారు గ్రామీణ స్థాయిలో హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ వద్ద అనుమానిత డెంగ్యూ లక్షణాలు గలవారికి ఎం ఎల్ హెచ్ పి ద్వారా డెంగ్యూ కిట్లు ద్వారా పరీక్షలు చేసి పాజిటివ్‌గా గుర్తిస్తే డెంగ్యూ నిర్ధారణకు మేక్ ఎలిసా పరీక్షకు తణుకు రిఫర్ చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్, డాక్టర్ ఎం నవ్య జీవన్,ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు ,పీహెచ్ఎన్ పి ఎలిజిబెత్, సూపర్వైజర్లు ఎస్.కె అమలేశ్వర రావు,డి కమల,జి ఉదయ్ చందర్ ,ఫార్మసిస్ట్ పీవీ స్వామి, సీనియర్ అసిస్టెంట్ రమేష్ బాబు ,ఏ ఎన్ ఎంలు హెల్త్ అసిస్టెంట్లు ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బాల సంజీవనితో ఎక్కువ పోషక విలువలు



ద్వారకా తిరుమల,మేజర్ న్యూస్: మండలంలోని గుండుగొలనుకుంట సచివాలయ పరిధిలో అంగన్వాడి సెంటర్లో పౌష్టికాహార మాసోత్సవాలు కార్యక్రమంలో భాగంగా ఈసీసీఈ లెర్నింగ్ కార్నర్ లను ప్రోత్సహించడానికి ప్రత్యేకంగా శిక్ష చౌపాల్, బొమ్మల ఆధారిత అభ్యాసం, ఖేలో ఔర్ పడో ఈవెంట్ల నిర్వహించారు. స్వదేశీ బొమ్మలను ప్రోత్సహించే ఆటలు, ఆధారిత అభ్యాసం ,స్వదేశీ బొమ్మల ప్రదర్శన ,స్వదేశీ బొమ్మల తయారీ వర్క్ షాప్, ప్రీ స్కూల్ రీడింగ్ యాక్టివిటీ, పిల్లలకు వయసు నిర్ధారత క్రీడలు నిర్వహించారు.

గుండుగొలనుకుంట గ్రామ సర్పంచి బండారు ధనలక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్లో ఇస్తున్న బాల సంజీవని అనేది ఎన్నో ఎక్కువ పోషక విలువలు కలిగి ఉన్నది. కనుక గర్భవతులు,బాలింతలు వీటిని తమ ఆహారంలో తప్పనిసరిగా చేర్చుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన శిశువులు జన్మించడం జరుగుతుం దన్నారు.

ఐసిడిఎస్ సూపర్వైజర్ మేరీ మాట్లాడుతూ గర్భిణిగా ఉన్నప్పుడు సరైన పోషక ఆహారం లేకపోతే పుట్టబోయే బిడ్డ తక్కువ బరువుతో లేదా పోషకాహార లోపంతో పుడతారు. కనుక మహిళల్లో రక్తహీనతను,పిల్లల్లో పోషకాహార లోపాన్ని ఈ బాల సంజీవని తీసుకోవడం ద్వారా తగ్గించుకోవచ్చు అని అన్నారు. తర్వాత తల్లి బిడ్డ ఆరోగ్యం– దేశ ప్రగతికి మూలం, మునగాకు తినరా– చక్కగా చూడరా. సంగీతానికి సరిగమలు– ఆరోగ్యానికి ఆకుకూరలు ,తాజా పండ్లు తినండి– ఆరోగ్యంగా ఉండండి, వంటి చక్కని సందేశాలతో గ్రామంలో ర్యాలీ,మానవహారం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో జిమ్ ఎస్కే లక్ష్మీ సుజన,అంగన్వాడీ టీచర్లు అనంతలక్ష్మి, సరిత,మహాలక్ష్మి ,భవాని, పుణ్యవతి,ఏఎన్ఎం పార్వతి, ఎం ఎల్ హెచ్ పి సర్జన్ కుమార్,ఆశా వర్కర్లు,పాల్గొన్నారు.

# అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు

### – డ్రైనేజీల ఆక్రమణలు జెసిబితో తొలగింపు : సర్పంచ్



**కైకలూరు,మేజర్ న్యూస్:** కైకలూరు గ్రామ సర్పంచ్ దానం మేరీ నవరత్న కుమారి ఆదేశాల మేరకు ఇటీవల అకాల వర్షాల వల్ల నీరు నిల్వ ఉండి అంటు వ్యాధులు ప్రబలకుండా కైకలూరు గ్రామంలో బ్లీచింగ్ చల్లుట జరిగినది. గ్రామంలోని ఒకటి మరియు, రెండు వార్డులలో మురుగునీరు డ్రైనేజీల ఆక్రమణలను జెసిబితో తొలగిస్తూ యుద్ధ ప్రాతిపదికన పనులు చేయిస్తున్నారు.

గత నాలుగు రోజుల నుండి సర్పంచ్ నవరత్న కుమారి కైకలూరు గ్రామంలో పర్యటిస్తూ వరదల వల్ల ఇబ్బందులు కలగకుండా అనేక రకాల చర్యలు తీసుకుంటూ పంచాయతీ సిబ్బందిని అప్రమత్తం చేస్తూ డ్రైనేజీలపై ఆక్రమణలను తొలగించే విధంగా వరదల బారి నుండి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులతో కలిసి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఏ వెంకటేశ్వరరావు, విఆర్ఓ ఎన్. సీతారామ్, సచివాలయ కార్యదర్శిలు రవిశంకర్, వెంకటేశ్వరరావు, గ్రామపంచాయతీ సిబ్బంది పి వి శ్యామలరావు, వెంకటేశ్వరరావు, అశోక్, వార్డు సభ్యులు గాలిబ్ బాబు, గ్రామస్తులు బిజెపి నాయకులు వేంపాటి విష్ణు, గుడిపాటి జగన్నాథం, హమీద్ పాల్గొన్నారు.

## రికార్డు స్థాయిలో రక్తదాన శిబిరం : ఎమ్మెల్యే బొలిశెట్టి ప్రశంస




**తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్:** ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు కొణిదల పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా తాడేపల్లిగూడెంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరం పలు రికార్డులను సొంతం చేసుకోవడం ఆనందంగా ఉందని శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. తాను విదేశీ పర్యటనలో ఉన్న ఇంతటి కార్యక్రమాన్ని తమ భుజాలపై వేసుకున్న జనసేన తెలుగుదేశం బిజెపి నాయకులతో పాటు మెగా ఫ్యాన్స్ కు ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. 967 యూనిట్ల రక్తదానం చేసి రికార్డు సృష్టించడం తాడేపల్లిగూడెంకు గర్వకారణంగా ఆయన చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా రక్తదాన నిర్వహణ కమిటీ అధ్యక్షుడు బొలిశెట్టి శ్రీనివాస్ తనయుడు రాజేష్ మాట్లాడుతూ పెద్ద కార్యక్రమాన్ని నిర్వహించడంలో జనసేన తో పాటు తెలుగుదేశం బిజెపి కార్యకర్తలు మెగా ఫాన్స్ తోపాటు సహకరించిన ఐదు బ్లడ్ బ్యాంకుల సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. 967 యూనిట్లు ఐదు గంటల్లో సేకరించి లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ తో పాటు, తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లోను స్థానం సంపాదించడం అందరూ పడ్డ కష్టానికి ప్రతిఫలం లభించినట్లు అయిందని అభిప్రాయ పడ్డారు.

### న్యాయ సేవాధికారి సంస్థ కమిటీ మెంబర్‌గా రామారావు



**ఏలూరు,మేజర్ న్యూస్:** ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల న్యాయ సేవాధికారి సంస్థ కమిటీ మెంబర్ సోషల్ వర్కర్‌గా మానేపల్లి రామారావు నియామకం జరిగింది. సంఘ సేవకులు ,సామాజిక వేత్త, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ తాను సంపాది ంచి సొమ్మును పేదలకు అనేక విధాలుగా ఆర్థిక సహాయం అందిస్తూ సోషల్ వర్కర్‌గా మానవతా సంస్థ శాశ్వత మెంబర్‌గా అనేక సేవా సంస్థల్లో రామారావు పలు బాధ్యతలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల న్యాయ సేవ అధికారి సంస్థ (లోక్ అధాలత్ కోర్టు) కమిటీ మెంబర్‌గా మానేపల్లి రామారావును నియమించారు. ఆయనకు మానవత, లైన్స్ క్లబ్,గో సంరక్షణ సమితి,ఇతర సంస్థలు అభినందనలు తెలియజేశారు.

### వరద బాధితులకు వాసవి క్లబ్ చేయూత



**నూజివీడు,మేజర్ న్యూస్ :** నూజివీడులోని పెద్ద చెరువుకు గండి పడి నిరాశ్రయులైన బాధితులకు నూజివీడు వాసవి క్లబ్ చేయూత అందించింది. పది కుటుంబాల వారికి నిత్యావసర వస్తువులను మంగళవారం అందచేశారు. ఈ కార్యక్రమములో వాసవి డిస్ట్ ఇంఛార్జి చిన్నం శ్రీనివాస రావు,ప్రెసిడెంట్ వనమా వెంకటేశ్వర రావు, కార్యదర్శి గదే శివ రామకృష్ణ,వాసవి క్లబ్ నాయకులు మానేపల్లి సతీష్ , తటవర్తి కుమార్ సుష్మాను ,మాటూరి సుధాకర్, పేర్ల వెంకటేశ్వరరావు, రమేష ,అత్తులూరి నళిని మోహన్ పాల్గొన్నారు.

సూర్య

పశ్చిమ గోదావరి

బుధవారం,
4 సెప్టెంబర్ 2024



# రవి స్కానింగ్ సెంటర్ షార్ట్ సర్క్యూట్




**పాలకొల్లు,మేజర్ న్యూస్:** ఎర్ర వంతెన సమీపంలో గల రవి స్కానింగ్ సెంటర్ నందు షార్ట్ సర్క్యూట్ కావడంతో పొగతో ఊపిరాడక ఉద్యోగులు బయటికి పరుగులు తీశారు. పాలకొల్లు ఫైర్ సిబ్బంది హుటాహుటిన వచ్చి పొగను అదుపు చేశారు, ఈ సందర్భంగా ఫైర్ సిబ్బంది మాట్లాడుతూ ఇటువంటి పెద్ద సంస్థల్లో ఎస్టన్ గేసర్స్ లేకపోవడం దారుణమని అన్నారు. ప్రక్కనే హెచ్.పీ గ్యాస్ కంపెనీ, హెచ్.పీ పెట్రోల్ బంకు ఉన్నందున దానిలోని సిబ్బంది భయంతో బంకులో ఉన్న ఎస్టన్. గేషర్స్ ఇసుకను తీసుకురావడంతో పెను ప్రమాదం తప్పిందిపాలకొల్లు ఎర్ర వంతెన సమీపంలో గల రవి స్కానింగ్ సెంటర్ నందు షార్ట్ సర్క్యూట్ కావడంతో పొగతో ఊపిరాడక ఉద్యోగులు బయటికి పరుగులు తీశారు. ఫైర్ సిబ్బంది ఎల్ఎఫ్టి సతీష్,డి ఓ పి వెంకట్, ఎఫ్ఎం సురేష్, వాసు, హెచ్జీలు నాగరాజు, భరతులు పాల్గొన్నారు,

## నేడు జరగాల్సిన స్కూల్ గేమ్స్ వాయిదా

**పెదవేగి,మేజర్ న్యూస్:** ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాస్థాయి క్రీడాజట్ల ఎంపిక పోటీల్లో భాగంగా 4వ తేదీన జరగాల్సిన ఎంపిక,పోటీలను వరదల కారణంగా వాయిదా వేశామని అండర్ 19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పెదవేగి గురుకుల విద్యాలయం పీడీ కందికొండ జయరాజు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు సంబంధించిన హైస్కూల్, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు ఈనెల 4వ తేదీ బుధవారంనుంచి 21వ తేదీవరకు నిర్వహించడానికి షెడ్యూల్ను ప్రకటించిన విషయం విదితమే. కాగా కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలు, వరదల కారణంగా 4వ తేదీన పెదవేగిలోని గురుకుల విద్యాలయంలో బాల, బాలికలకు సాఫ్ట్బాల్, బేస్బాల్, అథ్లెటిక్స్, సెపెక్ తక్రా, కుస్తీ పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు ప్రకటించారు. కాగా 4వ తేదీన జరిగే ఎంపిక పోటీలను మాత్రమే వాయిదా వేశామని, మిగిలిన పోటీలు ముందుగా ప్రకటించిన ప్రకారం ఈనెల 6వతేదీ శుక్రవారంనుంచి 21వతేదీ సామవాం వరకు ప్రకటించిన విద్యాలయాల్లో యదాతదంగా జరుగుతాయని, అర్హులైన విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డులతో ఆయా చోట్ల జరిగే పోటీలకు హాజరుకావాలని ఆర్గనైజింగ్ కార్యదర్శి జయరాజు సూచించారు. 4వ తేదీన జరగాల్సిన పోటీలు ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియపర్చుతామని ఆయన తెలిపారు.

# ఘనంగా ఆర్టీసీ కండక్టర్ సింహాద్రి పద్మావతి పదవీ విరమణ వేడుక

**ఏలూరు,మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో 22 ఏళ్ళపాటు మహిళా కండక్టర్గా సింహాద్రి పద్మావతి విశిష్ట సేవలందించారని పలువురు ఆర్ టిసీ ఉద్యోగులు కొనియాడారు. జంగారెడ్డిగూడెం డిపోలో మహిళా కండక్టర్ గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న సింహాద్రి పద్మావతి గత ఆగస్టు 31వ తేదీన పదవి విరమణ చేశారు. ఆమె కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం కండక్టర్ పద్మావతి పదవీ విరమణ కార్యక్రమాన్ని స్థానిక పెరుగు చెట్టు వద్ద జయం మినీ కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. పద్మావతి భర్త కూడా ఆర్టీసీలో డ్రైవర్గా పనిచేస్తూ అనారోగ్యంతో కన్నుమూశారు.

ఆయన మరణానంతరం ఆమె కండక్టర్గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. తోటి ఉద్యోగస్తుల ఆదరభిమానాలు చూరగొంటూ మచ్చలేని మంచి ఉద్యోగిగా నేడు పదవి విరమణ పొందటం అభినందనీయమని సంస్థ విశ్రాంత ఉద్యోగులు బెజవాడ. రవి (బివిఎం రావు),చంద్రమౌళి, మహిళా కండక్టర్ వల్లికుమారి, కండక్టర్ గోరింక అనిల్ కుమార్,రాజా, బైబిల్ మిషన్ చర్చి దైవ సేవకులు జెస్లీ నోవా, క్రైస్ట్ చర్చ్ దైవ సేవకులు బండి జీవానందం, పలువురు వక్తలు కొనియాడారు. ఈసందర్భంగా



కండక్టర్ పద్మావతి కుమార్తె,భీమడోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయులురాలు ఎస్.శివ శ్రీలత మాట్లాడుతూ తన తండ్రిమరణం తర్వాత కుటుంబాన్ని తన తల్లి నిలబెట్టిందన్నారు. ఈకార్యక్రమంలో భీమడోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాళ్లు,ఆర్టీసీ ఉద్యోగులు,పలువురు జర్నలిస్ట్లు, కుటుంబ సభ్యులు, ఆత్మీయులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## గర్భిణీని వేలేరుపాడు ఆసుపత్రికి తరలింపు

వేలేరుపాడు,మేజర్ న్యూస్ : గోదావరి నదికి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో ముంపుకు గురయ్యే అవకాశం వున్న ప్రాంతాల్లోని నిండు గర్భిణుల ను,వృద్ధులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జిల్లా కలెక్టర్ వారి ఆదేశాలు ఇచ్చారు.



ఆ మేరకు మంగళవారం వేలేరుపాడు మండలం రుద్రమకోటకు చెందిన గర్భిణీనీ వేలేరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకు వెళ్ళాడం జరిగిందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.ఏస్.శర్మిష్ఠ తెలిపారు.అదేవిధంగా తమ దగ్గర ఉన్న సమాచారం మేరకు మిగిలిన వారిని కూడా సమీప ఆస్పత్రులలో చేర్చడం జరుగుతుందన్నారు.

## 7న ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు



**పాలకొల్లు,మేజర్ న్యూస్:** భారతీయ సంస్కృతి, సనాతన ధర్మాలను అనుసరించి భారతీయుల నిర్వహించుకునే మొట్టమొదటి పండుగ వినాయక చవితి ఈ శనివారం నిర్వహించబోయే, వినాయక చవితిని పెద్ద ఎత్తున ఘనంగా, సాంప్రదాయపద్ధంగా నిర్వహించాలనే లక్ష్యంతో ఉన్న ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పాలకొల్లులో వాడవాడలా ఏర్పాటు చేసి ఆ వినాయక మండపాల కమిటీలను ప్రోత్సహిస్తూ వారందరనీ ఏకతాటిపై నడిపించేందుకు ప్రయత్నం చేస్తుంది. 7వ తేదీన వినాయక విగ్రహాల ప్రతిష్టాపన పూర్తయిన తర్వాత ఎనిమిదో తారీఖున సాయంత్రం ప్రతి మండపాన్ని సందర్శించి అక్కడ ఉన్న నిర్వాహకులకు సత్కారం చేసి ప్రసాద వినియోగం చేయడం జరుగుతుందని సంస్థ ప్రతినిధులను సత్కరించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు గాది వెంకన్న, కార్యదర్శి తోట రాంబాబు కోశాధికారి శీరం ఆనంద్ కృష్ణ, వ్యవస్థాపక అధ్యక్షులు కె.వి.కృష్ణ వర్మ, గౌరవ సలహాదారులు జక్కంపూడి కుమార్, మేడికొండ శ్రీనివాస్ చౌదరి తదితరులు పాల్గొన్నారు,

## ఉద్యోగ భద్రత కల్పించాలని మద్యం దుకాణా ఉద్యోగుల ర్యాలీ




**భీమవరం,మేజర్న్యూస్:** ఆంధ్రప్రదేశ్లో నూతనంగా ఎన్నికైన కూటమి ప్రభుత్వం మద్యం దుకాణాలకు స్వస్తి చెప్పీ పాత పద్ధతిలో టెండర్లు ద్వారా నూతన మద్యం విధానాన్ని ప్రవేశపెట్టబోతున్నట్లు వస్తున్న విస్తృత ప్రచారానికి మద్యం దుకాణాల్లో పనిచేస్తున్నా ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఏపీ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం భీమవరంలో శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ తాము ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకం కాదని గత ఐదేళ్లుగా ఈ ఉద్యోగాల మీదనే ఆధారపడి మా జీవనం కొనసాగిస్తున్నామని కానీ కూటమి ప్రభుత్వ రూపొందిస్తున్నా నూతన మద్యం పాలసీతో తమ ఉద్యోగాలు పోతాయని తద్వారా పదిహేను వేల మంది ఉద్యోగుల కుటుంబాలు రోడ్డున పడతాయి అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 7 వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు దిగుతామని తెలిపారు.ఇప్పటికైనా నూతన పాలసీ ప్రకటించే ముందు ఉద్యోగుల ఉద్యోగ భద్రత పై సీఎం చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు నేరుగా చర్చించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## తాగు నీటిలో క్లోరినేషన్ చేయాలి

**– ఉమ్మడి ప.గో. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పద్మశ్రీ ప్రసాద్**



**ఏలూరు,మేజర్ న్యూస్:** ఏలూరు జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయం నందు జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వకహణ అధికారి,పంచాయతిరాజ్,రక్షిత మంచినీటి సరఫరా,ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల దృష్ట్యా,భారీ వర్షాల కారణంగా రక్షిత నీటి సరఫరా అధికారులు గ్రామాలలో తాగునిరు సరఫరా చేసే విషయంలో క్లోరినేషన్ చేయాలని సూచించారు.ఆయా గ్రామంలో కార్యదర్శులను భాగస్వామ్యం చేసుకొని త్రాగునిరు ఇబ్బంది లేకుండా సరఫరా చేయాడానికి చర్యలు తీసుకోవాలని, పంచాయతీరాజ్ ఇంజినీర్ అధికారులు నిర్మాణం ఉన్న పనులకు సంబందించిన మెటీరియలను వర్షాల భారిన పడనివ్వకుండా గోడౌన్లో భద్రపరిచేలా చర్యలు తీసుకోవాలని చైర్ పర్సన్ పద్మశ్రీ ప్రసాద్ తెలిపారు. అంటు వ్యాధులు ప్రబల కుండా పారిశుద్ధ్యం మెరుగు చేయించాలని చేయించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ సుబ్బారావు, పంచాయతీరాజ్ ఈ ఈ రమణ మూర్తి, రక్షిత నీటి సరఫరా విభాగం ఈఈ త్రినాధ్ పాల్గొన్నారు.

## భీమవరం-యనమదుర్రు రహదారిపై ప్రమాదం

**– తృటిలో ప్రాణాలతో బయటపడ్డ ఆక్వా వర్కర్లు**



**భీమవరం,మేజర్ న్యూస్:** భీమవరం-యనమదుర్రు రహదారిపై మంగళవారం బస్సు ప్రమాదం చోటు చేసుకుంది. కే జి ఆర్ ఎల్ కాలేజీ దాటిన తర్వాత లాకుల సమీపంలో ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లకు వర్కర్లను తీసుకెళ్తున్న ప్రైవేట్ బస్సు రహదారి నుంచి అదుపుతప్పి పొలాల్లోకి దూసుకుపోయింది. ప్రమాద సమయంలో బస్సులో ఉన్న వర్కర్లు తృటిలో ప్రాణాలతో బయటపడ్డారు. బస్సు అద్దాలు పగలగొట్టి వారు స్వల్ప గాయాలతో బయటపడినట్లు సమాచారం. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఆక్వా ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ యాజమాన్యం వారి స్వలాభం కోసం ప్రైవేట్ బస్సుల్లో పరిమితికి మించి ఆక్వా వర్కర్లను తరలిస్తున్నారని పలు ఆరోపణలు వస్తున్న పట్టించుకునే అధికారులే లేరు.. 2018లో కూడా ఇలాంటి ఘటన ఒకటి చోటుచేసుకోగా, అప్పుడు ఒక మహిళా వర్కర్ మృతి చెందింది. పలువురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఆక్వా ఫ్యాక్టరీలు వారి లాభం కోసం వర్కర్లను ప్రమాదకర పరిస్థితుల్లో తరలిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రవాణా శాఖ అధికారులు ఈ అంశంపై చర్యలు తీసుకోవాలని, వర్కర్లకు భద్రతను కాపాడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# అధ్వాన స్థితిలో పెనుగొండ స్మశాన వాటిక





**పెనుగొండ,మేజర్న్యూస్:** పుట్టిన ప్రతి మనిషి గిట్టక తప్పదు. ఇది ప్రకృతి ధర్మం. మనిషి పుట్టిన తర్వాత సామాజిక స్థితిగతులను బట్టి మనిషి జీవన విధానంలో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నప్పటికీ శాశ్వతంగా విశ్రమించే శ్మశానంలో మాత్రం ఎలాంటి వ్యత్యాసం ఉండదు. కొందరు ఖననం చేస్తే మరికొందరు దహనం చేస్తారు ఇవే తేడాలు. సుమారు 25000 వేల జనాభా కలిగి ఉన్న పెనుగొండ మేజర్ పంచాయతీలో స్మశానవాటిక పరిస్థితి చాలా అధ్వానంగా తయారైందని సిపిఎం పార్టీ నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు ,మాదాసు నాగేశ్వర రావు తెలియజేశారు. ఎవరైనా చనిపోయిన వ్యక్తిని ఖననం చేసినప్పుడు సరైన స్థలం లేక దారి ప్రక్కనే పూడ్చే దుస్థితి ఉందని చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మనిషి చనిపోయాక మన ఊరిలోనే దహన సంస్కారాలు చేయమని చెప్పేవారు, నీ ఇప్పుడు పెనుగొండలో మాత్రం ఆ పరిస్థితి లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రస్తుతంఇక్కడ స్థానికులు సిద్ధాంతం వెళ్లి దహనసంస్కారాలు చేసుకోవలసి వస్తోందని బాధను చెబుతున్నారు. పల్లెటూరులో సహా అనేక ప్రాంతాల్లో రుద్రభూమి అతి సుందరంగా తీర్చిదిద్దికుంటు న్నారు, ప్రస్తుతం పెనుగొండ స్మశాన వాటికలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని లోపల చెట్లతో, చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా ఉన్నాయని కూర్చుని కార్యక్రమం చేసుకోవాలంటే చాలా ఇబ్బందిగా ఉందని స్మశాన వాటిక వచ్చిన ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా పెనుగొండ పంచాయతీ వారు స్పందించి స్మశాన వాటిక పరిస్థితులు చక్కదిద్దాలని స్మశాన వాటికకు వచ్చిన ప్రజలు కోరుతున్నారు.

# అన్న క్యాంటీన్లకు రూ.50వేలు విరాళం

ప్రకటించిన కాపుసంక్షేమ సేవాసంఘం

**ఏలూరు,మేజర్ న్యూస్:** కాపుసంక్షేమ సేవాసంఘం అధ్వర్యంలో ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు చాటపర్రురోడ్ లోని కాపుసంక్షేమ సేవాసంఘ జిల్లా అధ్యక్షులు పూజారి నిరంజన్ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా అన్నా క్యాంటీన్ల కు రూ.50వేలు విరాళం ఇవ్వాలని నిర్ణయించారు. యంపి పుట్టా మహేష్ కుమార్,ఎంఎల్ఏ బడేటి రాధాకృష్ణయ్య లకు అందచేయాలని నిర్ణయించారు.తొలుత సీనియర్ నాయకులు గాదం వెంకట రామకృష్ణ కేక్ కట్ చేశారు.ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన టీమ్ సభ్యులకు జ్ఞాపికలు అందచేశారు. కాపుసంక్షేమ సేవాసంఘ టీమ్ నాయకులు పులి శ్రీరాములు,మోటేపల్లి చంద్రశేఖర్,పూజారి నిరంజన్, వాసా రాజు,నడపన దాన భాస్కర్,వీరంరెడ్డి రమేష్,కురెళ్ళ భాస్కర్,బడే సతీష్ నాయుడు,నిమ్మల జ్యోతికుమార్,విఠాల శేషగిరి,పాటే రాంబాబు,



కూనిశెట్టి మురళీకృష్ణ తూతా హరి నాగరాజు,గుద్దటి రమేష్ ,దండిపాటి జగన్మోహన రావు,కాకర్ల శ్రీను,గొడవర్తి నవీన్ కుమార్, సాయి,శాయన రాంబాబు,సుంకర నారాయణ మూర్తి వెన్నవల్లి తారక రామప్రసాద్, సవిరే రాజేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి




**కుక్కునూరు,మేజర్ న్యూస్:** ధరల తగ్గింపుపై సిపిఐ దేశ వ్యాప్త పిలుపులో భాగంగా కుక్కునూరు మండలంలో సిపిఐ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన కొనసాగుతుంది. అమరవరం, ఉప్పేరు, మాధవరం, వింజరం సచివాలయాల ఎదుట సిపిఐ నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి మాట్లాడుతూ నిత్యావసర, పెట్రోల్ ధరలు తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సగటు మనిషికి అందుబాటులో ఉండే విధంగా ధరలను తగ్గించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అంతేకాకుండా రేషన్ వ్యవస్థలో తక్కువ ధరకు సరుకులను లబ్ధిదారులకు పంపిణీ చేసి, అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులను మంజూరీ చేయాలని డిమాండ్ చేశారు. ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సచివాలయ సిబ్బందికి కుక్కునూరు మండల కార్యదర్శి మైసాక్షి.వెంకటా చారి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు కురాకుల. బాబూరావు,మండల కకౌన్సిల్ సభ్యులు వర్కా.నరసింహరావు, సోడే.రమేష్, కమల్, సంతోష్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పార్థసారధి సొంత డబ్బుతో 3 వేల మందికి ఆహార పొట్లాలు




**నూజివీడు,మేజర్ న్యూస్ :** రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి పిలుపుతో స్థానిక నాయకులు నూజివీడు నుండి 3 వేల ఆహార పొట్లాలను విజయవాడ నగరంలో వరద బాధితులకు పంపిణీ నిమిత్తం పంపించారు. విజయవాడలో ప్రకృతి సృష్టించిన విలయంనకు స్పందించిన మంత్రి పార్థసారథి తన స్వంత నగదుతో 3 వేల మందికి అల్పాహారాన్ని సోమవారం పంపించారు. మంత్రి అందించిన స్ఫూర్తితో నూజివీడు పట్టణానికి చెందిన నాయకులు పి, శ్రీకాంత్. పి, చిన్నారి. వై, బాబి. వై, చిన్ని. ఎమ్, రమేష్.తదితరులు కలసి సొంత ఖర్చుతో 2 వేల మంది వరద బాధితులకు సరిపడ భోజన పేకెట్స్ ను నూజివీడు నుండి విజయవాడ సింగ్ నగర్, సత్యన్నారాయణ పురం వరద బాధితులకు పంపిణీ చేసేందుకు పంపించారు. అదేవిధంగా నూజివీడు మండలం చనుబండ గ్రామానికి చెందిన కొందరు ప్రముఖులు వెయ్యి ఆహార పొట్లాలను బాధితులకు పంపిణీ చేసేందుకు విజయవాడకు వాహనంలో పంపించారు. ఆపద సమయంలో తోటివారిని ఆదుకోవలసిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని, ప్రజలు, నాయకులు వచ్చి వరద బాధితులను ఆదుకునేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని మంత్రి పార్థసారథి విజ్ఞప్తి చేశారు.

# వరద బాధితులకు ఎమ్మెల్యే బడేటి చంటి ఉదారత

**– దాతల్ని కలుపుకుంటూ బాధితులకు ఆపన్నహస్తం**



**ఏలూరు,మేజర్ న్యూస్:** ఎడతెరిపి లేని వర్షాలు, భారీ వరదలతో విజయవాడ నగరం జలమయమై జనజీవనం స్థంబించిన నేపథ్యంలో సహాయ కార్యక్రమాలు ముమ్మరం చేయాలని సీఎం చంద్రబాబు ఇచ్చిన పిలుపుతో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ఆధ్వర్యంలో దాదాపుగా 70వేల ఆహార ప్యాకెట్ల తరలింపు చేపట్టామని నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు పేర్కొన్నారు. ఏలూరు నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలను విస్తృతపరిచేందుకు ఆహర్నిశలు కృషిచేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పిలుపునివ్వడంతో ఆ దిశగా కృషిచేసేందుకు సిద్ధమైన ఎమ్మెల్యే బడేటి చంటి తన ఉదారతను చాటడంతో పాటూ నియోజకవర్గంలోని దాతలందర్నీ కలుపుకుని భారీ సాయం అందించారు. విజయవాడ వరద బాధితులకు 30వేల ఆహార ప్యాకెట్లను తయారు చేయించిన ఎమ్మెల్యే, మిగిలిన దాతల సహాయంతో దాదాపుగా 40వేల ఆహార ప్యాకెట్లను విజయవాడ తరలించేందుకు సిద్ధం చేశారు. ఏలూరు పవర్ పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో విజయవాడ వెళ్ళేందుకు ఆహార ప్యాకెట్లు, మంచినీటి బాటిళ్ళతో సిద్ధమైన వ్యాన్లను నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, మాజీ డిప్యూటి మేయర్ చోడే వెంకటరత్నం జెండాఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కో – ఆప్షన్ సభ్యులు ఎస్కెమ్మార్ పెదబాబు, టిడిపి నాయకులు చల్లా వెంకట సత్యవరప్రసాదరావు, ఈతకోట శ్రీనివాసరావు, ఆర్నేపల్లి మధు, బెల్లపుకొండ కిషోర్, ఈతకోట శ్రీనివాస్ రావు, రిలాక్స్ బాలాజీ, బిర్లా భవన్ రాజా తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ జిల్లాకు కొనసాగుతున్న వరద సహాయం

**– ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి**





**ఏలూరు,మేజర్ న్యూస్:** ఏలూరు జిల్లా నుండి ఎన్టీఆర్ జిల్లాకు వరద సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. మంగళవారం తెల్లవారుఝామున ఏలూరులో గోకుల్ కల్యాణమండపం, పత్తేబాద లోని కేటరింగ్ సెంటర్లలో అల్పాహారం తయారీ ప్యాకింగ్ పనులను, ఆహార నాణ్యతలను కలెక్టర్ పరిశీలించారు. మంగళవారం మరో లక్షా 60 వేల ఆహారాల పొట్లాలను ఎన్టీఆర్ జిల్లాకు పంపించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ సోమవారం ఉదయం నుండి సాయంత్రం వరకు లక్షా 25 వేల ఫుడ్ పాకెట్స్, లక్ష పాల పాకెట్స్, లక్ష బిస్కట్ ప్యాకెట్లు ,30వేల బ్రేడ్ పాకెట్స్, 50 కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు పంపించడం జరిగిందన్నారు. మంగళవారం ఉదయం అల్పాహారం ప్యాకెట్లను, ప్రత్యేక వాహనాలలో పంపించడం జరిగిందన్నారు. బాధితులకు అల్పాహార ప్యాకెట్లు సకాలంలో అందించేందుకు ఉదయం 4 గంటల నుండే తయారీ, ప్యాకింగ్ పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. అల్పాహార ప్యాకెట్లను విజయవాడకు సకాలంలో అందించడంతో బాధితులకు ఉపయోగప డ్డాయని, బాధితులు సంతోషం వ్యక్తం చేసారని కలెక్టర్ చెప్పారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ పీ. ధాత్రిరెడ్డి, ఆర్డిఓ ఎన్ ఎస్ కె ఖాజావలి, డీఆర్డీఏ పీడీ విజయరాజు, హౌసింగ్ పిడి శ్రీనివాస్, దెందులూరు తహసీల్దార్ సుమతీ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పుటేరులో తూడు తొలగింపు పనులు పూర్తి చేయాలి

**– జెసి రాహుల్ కుమార్ రెడ్డి**



**ఆకివీడు,మేజర్ న్యూస్:** ఉప్పుటేరులో తూడు తొలగింపు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మంగళవారం ఆకివీడు మండలం దుంపగడప రైల్వే బ్రిడ్జి వద్ద ఉప్పుటేరులో తూడు తొలగింపు పనులను ఆకస్మికంగా పరిశీలించారు. ఇప్పటికే తూడు తొలగింపు పనులు దబరాలతో 20 మందితో చేపట్టడం జరిగింది. జిల్లా జాయింట్ కలెక్టర్ జరుగుతున్న పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రైల్వే వంతెన వద్ద కొనసాగుతున్న తూడు తొలగింపు పనులకు అవసరమైతే రైల్వే అధికారుల సహకారం తీసుకోవడానికి చర్చించడం జరుగుతుందని తెలిపారు. రానున్న రెండు రోజుల్లో బంగాళాఖాతంలో వాయుగుండం పడే అవకాశం ఉందని వాతావరణం శాఖ హెచ్చరికలు నేపథ్యంలో పనులను త్వరగా పూర్తిచేసి నీటి ప్రవాహానికి కిక్కిస, తూడు, గుర్రపు డెక్క అడ్డంకులను తొలగించాలన్నారు. ఈ పర్యటనలో ఇరిగేషన్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ పి.వెంకటేశ్వరరావు, ఆకివీడు తహసిల్దార్ ఎన్.వెంకటేశ్వరరావు, ఎంపీడీవో కె.వాణి, ఇరిగేషన్, రెవిన్యూ సిబ్బంది, తదితరులు ఉన్నారు.